RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759





సంపుటి : 4 | సంచిక :88 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 18 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## పోలీసు వాహనాల్లోనే
# గంజాయి

ఇదేనా కూటమి పాలన?

వైయస్ జగన్ మోహన్ రెడ్డి ట్వీట్

పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం దొరకటంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



**తాడేపల్లి:**

పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం దొరకటంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పాలన ఏ స్థాయిలో కుప్పకూలిందో ఈ ఘటనే నిదర్శనం అంటూ ఫైరయ్యారు. చంద్రబాబూ...

వివరాలు 2లో..




## పంద్రాగస్టు వేళ భారీ ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టాం

- 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశాం
- అమిత్ షా కీలక ప్రకటన
- దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- ఐఎస్ఐ మద్దతు గల షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు ప్రకటన
- తద్వారా విధ్వంసర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు వెల్లడి

# ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి

- డీఎస్సీపై చర్చించండి
- వైసీపీకి సీఎం చంద్రబాబు సవాల్
- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం
- గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు
- మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం.



**అమరావతి**

మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని

వివరాలు 2లో..



## బీజేపీ నూతన జాతీయ కార్యవర్గం


- పురందేశ్వరికి ఉపాధ్యక్ష పదవి
- ప్రధాన కార్యదర్శులుగా 8 మంది
- బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం ప్రకటించిన నితిన్ నబీన్
- 13 మందికి బీజేపీ ఉపాధ్యక్ష పదవులు
- 8 మందికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవులు



## త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో భారత్ స్వయం సమృద్ధి

- అశ్విని వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు
- కీలక ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్లలో స్వయం సమృద్ధి సాధిస్తున్న భారత్
- ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ చైనాకు ఎగుమతి చేస్తున్న భారత పరిశ్రమలు
- ఎన్‌క్లోజర్లు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్స్‌లోనూ ఆత్మనిర్భరత

# రాష్ట్రంలో మారిన యూడీఏల ముఖచిత్రం




- కొత్తగా 3 పట్టణాభివృద్ధి సంస్థలు ఏర్పాటు
- ఏపీలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా యూడీఏల పరిధుల ప్రక్షాళన
- పరిపాలనా సౌలభ్యం కోసం నంద్యాల, మార్కాపురం, భీమవరం కేంద్రాలుగా మూడు కొత్త పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ

**అమరావతి**

రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత పట్టణాభివృద్ధి సంస్థల పరిధులపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. కొత్త జిల్లాల సరిహద్దులకు అనుగుణంగా యూడీఏల పరిధులను హేతుబద్ధీకరిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా యంత్రాంగంతో యూడీఏ అధికారులకు మెరుగైన సమన్వయం సాధించడం, పరిధిపై స్పష్టత తీసుకురావడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా మూడు నూతన పట్టణాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 11 యూడీఏల పరిధుల్లో సర్కార్ మార్పులు చేసింది. తిరుపతి, విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ), పుట్టపర్తి, నెల్లూరు, ఒంగోలు, ఏలూరు, కర్నూలు, కాకినాడ, మచిలీపట్నం, కడప, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థల పరిధులను కొత్త జిల్లాలకు అనుగుణంగా సవరించారు.
ఇక పరిపాలనా సౌలభ్యం కోసం మరో మూడు యూడీఏల పేర్లను ప్రభుత్వం మార్చింది. చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ పేరును చిత్తూరు, పలమనేరు, కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ (సీపీకేయూడీఏ)గా, పలమనేరు, కుప్పం, మదనపల్లె యూడీఏను (అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ)గా మార్పు చేశారు. అనంతపురం, హిందూపురం యూడీఏను

వివరాలు 2లో..



## అచ్చెన్న Vs బొత్స

- మండలిలో మాటల యుద్ధం
- మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ మండలిలో వైఎస్సార్సీపీ ఆందోళనతో
- తొలిరోజు కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం
- బొత్సపై మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలతో మండలిలో దుమారం

**అమరావతి**

మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్సీపీ చేసిన ఆందోళనతో శాసనమండలి కార్యకలాపాలకు తొలిరోజు తీవ్ర అంతరాయం కలిగింది. వైఎస్సార్సీపీ నినాదాలతో హోరెత్తించడంతో గందరగోళం

వివరాలు 2లో..



## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?

- ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశం



## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

- ఝార్ఖండ్ సర్కార్ సంచలన నిర్ణయం
- 2014 నుంచి జరిగిన అన్ని పరీక్షలపై సమగ్ర విచారణకు ఆదేశం
- అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు
- కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం.

# బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

వచ్చే ఎన్నికల నాటికి బద్వేలు అసెంబ్లీ జనరల్ కానుందా ?

గత 25 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వ్ ఉన్న బద్వేలు

పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు




**బద్వేలు** ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి. ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం. రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గం లోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది. ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి. నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది. ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి. తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి. 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి. అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది. ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరుపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది. మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది. పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది. ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది. విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు.

## గిరిజన పీహెచ్‌సీని సందర్శించిన ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి

**కొత్తపల్లి,** : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పి.వి.ఎస్. నాయుడు ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి బి. పరమేశ్వర్ కొత్తపల్లి, గోకవరం గిరిజన పీహెచ్‌సీతో పాటు యెర్రమటం చెంచు గూడెం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పనితీరు, ఓపీ సేవలు, తల్లి?బిడ్డ ఆరోగ్యం, గర్భిణీలకు అందుతున్న సేవలు, టీకాలు, జ్వరాలు, అంటువ్యాధులు, ప్రయోగశాల పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, మందుల లభ్యత తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు. చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలుకొత్తపల్లి, శివపురం, యెర్రమటం చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. యెర్రమటం చెంచు గూడెంలో జరిగిన వైద్య శిబిరానికి 55 మంది, కొత్తపల్లి గూడెంలో 60 మంది హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్తపోటు, మధుమేహం, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పూర్తి రక్త పరీక్షలు, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, పరిశుభ్రత, పోషకాహారం, సకాలంలో వైద్య సేవలు పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దీప్తి నాగవేణి, గులాబ్జా, డాక్టర్ హకీమ్ రషీద్, డాక్టర్ సుష్మా సాయి, ప్రజారోగ్య విస్తరణ వైద్యాధికారి రాఘవేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఏఎన్ఎంలు నిర్మల జయమణి, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, మెయిల్ హెల్త్ అసిస్టెంట్ శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు. డాక్టర్ హకీమ్ రషీద్ మాట్లాడుతూ యెర్రమటం, జనాల గూడెం ప్రాంతాల్లోని గర్భిణీలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ అవసరమైన పరీక్షలు, చికిత్స, తదుపరి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి శ్రీ బి. పరమేశ్వర్ వైద్య సిబ్బంది సేవలను అభినందించారు. గిరిజన పీహెచ్‌సీలో ప్రైవేట్ ఆసుపత్రులకు సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, తదుపరి చికిత్సపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.

## 85% సబ్సిడీతో గొర్రెలకు, మేకలకు పశు భీమా

## :-పి.భాస్కర్ (పశువైద్యాధికారి)

**పాములపాడు** 2026 -27 సంవత్సరానికి సంబంధించి పాములపాడు మండలానికి 220 జీవాలకు భీమా లక్ష్యం నిర్దేశించడమైనదని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మీడియా సమావేశంలో తెలిపారు. పాములపాడు మండలంలోని, గొర్రెల, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మాట్లాడుతూ వివరాలకు సమీపంలోని, రైతు సేవా కేంద్రంలోని అనీమల్ హస్బెం డ్రి అసిస్టెంట్ , స్థానిక పశువైద్యాధికారిని సమర్పించాలన్నారు. పెంపకం దారులు 6 నెలలు దాటిన గొర్రెలకు, మేకలకు భీమా చేయించాలన్నారు. 1 సంవత్సరము రూ"లు 6,000/- భీమా వర్తించుట కొరకు చెల్లించవలసిన ప్రీమియం 180 రూపాయలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ 153 పోను లబ్దిదారుడు కేవలం 27 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందనీ అన్నారు. ప్రతి గొర్రె, మేక కి తప్పని సరిగా చెవి పోగు / ట్యాగ్ వేయించాలన్నారు. ఎప్పుడైనా చెవి పోగు / ట్యాగ్ పడిపోతే వెంటనే పశువైద్య సిబ్బంది చేత కొత్త ట్యాగ్ వేయించాలనీ అన్నారు. ట్యాగ్ లేనిచో భీమా వర్తించదనీ అన్నారు. ఈ కార్యక్రమంలోసిబ్బంది తిరుమలేష్, కవిత, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎర్రకోట రాజీవ్ రెడ్డి

**నందవరం** మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చాంద్ భాషా గురజాల గ్రామస్తులు రాజారెడ్డి, పెద్ద నరసింహులు, హనుమంతు యువసేన సభ్యులు ఎం వీరేష్ మహేష్ నాగేంద్ర,రాముడు, రామకేసు, సురేష్, ని.బీముడు, కురువ రాముడు, తదితరులు..

## బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నిర్మల్ కుమార్

**రాయచోటి :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన జిల్లా కమిటీని సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నియమించారు. జిల్లా కార్యదర్శిగా తనను నియమించినందుకు రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, అన్నమయ్య జిల్లా పార్టీ నాయకత్వానికి నిర్మల్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ బాధ్యత లభించేందుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బీజేపీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని నిర్మల్ కుమార్ తెలిపారు. అలాగే నూతనంగా ఎన్నికైన అన్నమయ్య జిల్లా బీజేపీ కమిటీ సభ్యులందరికీ రాయచోటి బీజేపీ నాయకుల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## తుంగభద్ర నది ఎండిపోవడంపై కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి

**తుంగభద్ర జలాల కోసం రైతుల ఆవేదన**

**నందవరం** మండల పరిధిలోని గురజాల గ్రామంలో తుంగభద్ర నదిలో నీరు పూర్తిగా ఎండిపోయి, తాగు,సాగునీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నదిలో కనీసం ప్రవహించే నీరు కూడా కనిపించకుండా పోయిందని పాడి పశువులకు సైతం నది తీరంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గ్రామస్తులు, రాజీవ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు పూర్తిగా పడిపోయి కనీసం ప్రవాహపు జాడ కూడా లేకపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని రాజీవ్ రెడ్డి విమర్శించారు. తుంగభద్ర నది తీర ప్రాంత రైతులు తమ ప్రధాన సమస్యను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. తుంగభద్ర నది నుంచి నీరు వస్తుందనే నమ్మకంతో పంటలు సాగు చేశామని, వరి నాట్లు పూర్తయిన తర్వాత నీరు అందక పొలాలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నప్పటికీ దిగువ ప్రాంతమైన రాయలసీమకు,నది తీర ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి తుంగభద్ర జలాలను రాయలసీమ రైతులకు అందించాలని కోరారు. సాగునీరు అందక ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నాయని, రైతన్నలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నా కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఇసుక రీచ్‌ల పేరుతో దోపిడీ నదిలో చుక్క నీరు లేక ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే, మరోవైపు ఇసుక రీచ్‌ల పేరుతో నదిని మరింతగా దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## చేనులకు హంద్రీనీవా నీళ్ల నిలిపివేత:

తీవ్ర ఆగ్రహంలో రైతన్నలు

అధికారుల తీరుపై మండిపడుతున్న అన్నదాతలు

పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన

**పత్తికొండ** పత్తికొండ మండలం హోసూరు గ్రామం లో పంట పొలాలకు జీవనాధారమైన హంద్రీనీవా కాలువల నుంచి చేనులకు నీటిని కట్టకుండా అధికారులు ఆంక్షలు విధించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాలకు నీరు పారించుకోవడానికి వెళ్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని, దీనివల్ల కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?పంటలు ఎండిపోతున్నా పట్టవా??రాత్రింబవళ్లు కష్టపడి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశామని, ఇప్పుడు కీలక సమయంలో నీళ్లు ఇవ్వకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. తమ కళ్లముందే చేన్లు ఎండిపోతుంటే అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ?అధికారుల వైఖరిపై విమర్శలు ?నీటి వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించడం, కాలువల వద్ద కాపలా ఉండి నీటిని మళ్లించకుండా అడ్డుకోవడంపై స్థానిక హోసూర్ రైతు, బనగాని శ్రీనివాసులు, మండిపడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ?"సాగునీరు అందక పంట ఎండిపోతే మేము అప్పుల పాలవుతాం. అధికారులు వెంటనే స్పందించి చేనులకు నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతాం."బాధిత రైతులు ?రైతుల ప్రధాన డిమాండ్లు: ?హంద్రీనీవా కాలువల నుంచి పంట పొలాలకు నీటిని తక్షణమే విడుదల చేయాలి. ?చేనులకు నీళ్లు కట్టకుండా అడ్డుకుంటున్న అధికారుల తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ?చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి. ?వెంటనే అధికారులు స్పందించి తమ పంటలను కాపాడాలని, హోసూర్ గ్రామ రైతులు తదితరులు కోరుతున్నారు

## అచ్చెన్న Vs బొత్స

-మొదటిపేజీ తరువాయి

నెలకొంది. విపక్ష నేత బొత్స సత్యనారాయణపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సభలో దూమారం లేపాయి. ఇద్దరి మధ్యా జరిగిన వాగ్వాదం మండలిలో వేడిని పెంచింది. వైఎస్సార్సీపీ ఆందోళన వీడకపోవడంతో మండలిని ఛైర్మన్ మంగళవారానికి వాయిదా వేశారు.

**గందరగోళం- సభ వాయిదా**

మండలి కార్యక్రమాలు ప్రారంభం కాగానే వైఎస్సార్సీపీ సభ్యులు డీఎస్సీపై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ మోషేను రాజు తిరస్కరించారు. దీంతో వైఎస్సార్సీపీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి ఆందోళనల మధ్యే ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. కేవలం 2 ప్రశ్నలే జరిగాయి. వైఎస్సార్సీపీ సభ్యుల తీరుపై మంత్రులు మనోహర్, అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఆర్డర్‌లో పెట్టాలని ఛైర్మన్‌ను కోరారు. అదే సమయంలో డీఎస్సీపై విచారణకు బొత్స డిమాండ్ చేశారు. మంత్రి అచ్చెన్న తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీపై మాట్లాడే అర్హత వైఎస్సార్సీపీకి లేదన్నారు. బొత్సపైనా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్సీపీ సభ్యులు నినాదాలు ఆపకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమయ్యాక బొత్సకు మంత్రి అచ్చెన్న క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్సీపీ సభ్యులు నినదించారు. మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలపై బొత్స అభ్యంతరం వ్యక్తం చేశారు. పని చేయటం చేతగానివారిని ఉద్దేశించి మాట్లాడే మాటనే తాను అన్నానని అందులో అసభ్యత లేదని అచ్చెన్న బదులిచ్చారు. వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనతో సభను ఛైర్మన్ మరోసారి వాయిదా వేశారు.

విద్యుత్ చట్ట సవరణ బిల్లు: భోజన విరామం తర్వాత శాసనమండలి మళ్లీ సమావేశమైనప్పటికీ వైఎస్సార్సీపీ సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును సభలో పెట్టేందుకు ఛైర్మన్ అనుమతించారు. మంత్రి గొట్టిపాటి బిల్లును ప్రవేశపెట్టగా సభ ఆమోదం పొందింది. వెంటనే మండలిని వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

## ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి..

-మొదటిపేజీ తరువాయి

ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019--24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మారిన యూడీఏల ముఖచిత్రం

-మొదటిపేజీ తరువాయి

(అనంతపురం పట్టణాభివృద్ధి సంస్థ)గా నామకరణం చేశారు.

మరోవైపు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్ల నిర్మాణం, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశు ద్ధ్యం మెరుగు తదితర విషయాలపై దృష్టి సారించనుంది. అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సర్కార్? మంజూరు చేయనుంది. అంతేకాక నగర ప్రాంతాల్లో ఉద్యానవనాలు అభివృద్ధి, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

**అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట**

ఇప్పటివరకు భవన నిర్మాణాలను ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు నిర్మించుకోవడం, గట్టిగా ప్రశ్నిస్తే అపరాధ రుసుంతో సరిచేసేవారు. ఇకపై పెద్ద భవన నిర్మాణాలు, లేఔట్ అనుమతులను పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. తద్వారా పారదర్శకంగా, నియమ నిబంధనల ప్రకారం అనుమతులు జారీకానున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడనుంది. పట్టణాభివృద్ధి సంస్థల పునర్?వ్యవస్థీకరణ ప్రక్రియపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత జిల్లా వ్యవస్థకు అనుగుణంగా, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా యూడీఏల నిర్మాణాన్ని ఆచరణాత్మకంగా మార్చామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో పట్టణాభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని నారాయణ పేర్కొన్నారు.

## పోలీసు వాహనాల్లోనే గంజాయి

-మొదటిపేజీ తరువాయి

అసలు రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారంటూ ప్రశ్నించిన జగన్.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి?. ఎవరికి ఫిర్యాదు చేయాలి?' అని ప్రశ్నించారు. ఈ మేరకు వైఎస్ జగన్ సోమవారం (ఆగస్టు 17) ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

'హే రామ్...! గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసుల వాహనంలోనే గంజాయి, మద్యం బాటిళ్లు కనిపిస్తే... రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా దిగజారిపోయాయో చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యం ఇంకేం కావాలి?

చంద్రబాబు.. అసలు రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి? ఎవరికి ఫిర్యాదు చేయాలి?

ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, శంఖవరప్పాడు వద్ద జరిగిన దాన్ని ఏదో ఒక్క ఘటనగా కొట్టిపారేయలేం. రెండేళ్లుగా వ్యవస్థలను ప్రజలకోసం కాకుండా రాజకీయ కక్షసాధింపులకు, ప్రత్యర్థుల గొంతు నొక్కడానికి, మీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి, మీ ఎమ్మెల్యేలతో కలిసి కలెక్షన్లు తెచ్చిపెట్టుకోవడానికి, వాడుకున్న ఫలితమే ఈ పతనం. వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు, మీ కలెక్షన్లకు వాడుకుంటే చివరకు అవి ఎంతగా భ్రష్టుపడతాయో ఈ ఘటన కళ్లకు కడుతోంది.

ఈనేపథ్యంలో, ఇద్దరు ఎస్సైలు ప్రయాణిస్తున్న కారు, తాగిన మత్తులో ఉన్న డ్రైవర్ ఒక ఆటోను ఢీకొట్టడం, ఆటోలో ఉన్నవాళ్లు తీవ్రంగా గాయపడ్డం, యాక్సిడెంట్ అయిన తర్వాత ఆ కారును చుట్టుముట్టడం, ఆ కారులో ఉన్న ఇద్దరు ఎస్సైలు మత్తులో ఉన్న పరిస్థితిలో ఉండడం, ఆ కార్ డిక్కీలో గంజాయి, మద్యం, పోలీస్ యూనిఫాం దొరకడం, చివరకు అక్కడున్న ప్రజలే జర్నలిస్టులుగా మారి, జరిగిన ఘటనను వీడియో తీసి వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేస్తే, "వీడియోలు తీయొద్దు, కేసులు పెడతాం" అని అక్కడకు చేరుకున్న మరో సీఐ, బెదిరిస్తున్నారంటే మీ పాలనలో పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది. నిజాన్ని బయటపెట్టడమే నేరమా? ప్రశ్నించడమే తప్పా? ఈ ఇద్దరు పోలీసు అధికారులు ప్రైవేటు పార్టీలు నిర్వహించారని, మద్యం, గంజాయి అక్కడ వాడారని, ఆ పార్టీలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారన్న సమాచారం మరింత దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఘటనా స్థలం నుంచి కారులో ఉన్న ఆ ఇద్దరు పోలీసు అధికారులను స్థానిక టీడీపీ నాయకులు తప్పించారన్న ఆరోపణలు కూడా అత్యంత తీవ్రమైనవి. నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన వ్యవస్థతో అధికార పార్టీ నాయకుల కుమ్మక్కు ఎంత లోతుకు వెళ్లిందో ఈ ఘటన బయటపెడుతోంది.

# భవన నిర్మాణ కార్మికులందరినీ రిజిస్ట్రేషన్ పరిధి లోకి తీసుకురావాలి.

**వారికి ప్రభుత్వ పథకాలు అందించాలి కొణతాల.**



**అమరావతి, ఆగస్ట్ 17:** సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ కార్మికులందరినీ రిజిస్ట్రేషన్ పరిధి లోకి తీసుకువచ్చి సంక్షేమ పథకాలు అందించాలి అని కోరారు. ప్రమాద, మరణ బీమాను కనీసం 5 లక్షలకు పెంచడంతో పాటు రాడ్ బెండింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, మేస్త్రీ తదితర రంగాల్లో స్థానిక కార్మికులకు నైపుణ్య శిక్షణ అందించాలి అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి, అచ్యుతాపురం 50 పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయడంతో పాటు అనకాపల్లిలో ఈఎస్‌ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామికీకరణ, విద్య, మౌలిక వసతుల రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్రం 10.5 శాతం జిఎస్డిపి వృద్ధిరేటు సాధించడం ఆర్థిక పురోగతికి నిదర్శనం అన్నారు. విద్యా వ్యవస్థ పునరుద్ధరణ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాల మెరుగుదల, డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి విమర్శలకంటే నిర్మాణాత్మక సహకారం అవసరమని సమావేశంలో కోరారు.

# గన్నవరం రైతుల సాగునీటి సమస్య పై అసెంబ్లీలో మాట్లాడిన యార్లగడ్డ.




**అమరావతి, ఆగస్ట్ 17:** కృష్ణా డెల్టాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల ప్రభావం గన్నవరం నియోజకవర్గం పైనా ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ లో మాట్లాడుతూ అన్నారు. రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన సమయంలో వైసీపీ నాయకులు ఈ అంశాన్ని తన నీచ రాజకీయాలకు వాడుకోవడం సరికాదని అసెంబ్లీలో స్పష్టం చేశారు. పట్టిసీమ నీరు గన్నవరం నియోజకవర్గం మీదుగా విజయవాడకు వెళ్లి, అక్కడి నుంచి ఏలూరు కాలువ ద్వారా తిరిగి గన్నవరం ప్రాంతానికి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఓటమి చెందిన వైసీపీ నాయకుడు గతంలో ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా మోటార్ల ఏర్పాటుకు తన సొంత నిధులతో సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తు చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో సాగునీటి సమస్యను రాజకీయంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలవరం నుంచి 137.6 కిలో మీటర్ల వద్ద ఏలూరు కాలువకు అనుసంధానం చేయాలని తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే కోరినట్లు యార్లగడ్డ తెలిపారు. ఇందు కోసం రూ.38 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఏలూరు కాలువ పరిధి లోని సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఈ పనులు ఉపయోగ పడతాయని, ఏలూరు, దెందులూరు ప్రాంతాల రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఎనికేపాడు వద్ద యూటీ నిర్మాణానికి మరో రూ.36 కోట్లు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ రెండు పనులకు గాను మొత్తం రూ.74 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం 5 వేల క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యం ఉందని, భవిష్యత్తులో దానిని 25 వేల క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉందని యార్లగడ్డ చెప్పారు. తద్వారా సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ఆరుతడి పంటలు సాగు చేయడం పై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. గన్నవరం నియోజకవర్గం పూర్తిగా ఆరుతడి పంటల పై ఆధారపడే ప్రాంతం కాదని, రైతుల పరిస్థితిని పరిగణన లోకి తీసుకుని నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పని చేసి పంటల బీమా విషయంలో తగిన అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

# జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఏఎంసి కాలనీ పరిశీలన

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 17:**
20 ఏళ్లుగా ఉన్న ఇంటి పట్టాల సమస్య పరిష్కారానికి హామీ, రెండు వారాల్లోగా లబ్ధిదారుల వివరాల సేకరణకు అధికారులకు ఆదేశం. అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో నిర్వహించిన గ్రీవెన్స్ సందర్భంగా ఏఎంసి కాలనీ నివాసి సింగంపల్లి భాను చందర్ సమర్పించిన అర్జీ పై జీవీఎంసీ ప్రధాన కమిషనర్ కేతన్ గార్గ్ తక్షణమే స్పందించారు. అనకాపల్లి 83 వ డివిజన్ పరిధి లోని ఏఎంసి కాలనీ ప్రభుత్వ అపార్ట్‌మెంట్లను ఆయన స్వయంగా సందర్శించి, స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కమిషనర్‌కు తమ వినతులను తెలియజేశారు. గత 20 ఏళ్లుగా నివసిస్తున్న 192 గృహాల నివాసితులకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, తీవ్రంగా దెబ్బతిన్న అపార్ట్ మెంట్ల వివరాలు సేకరించి, తదుపరి నివాసం ఉంటున్న ఇతరత్రా పత్రం ద్వారా మరమ్మతులు చేపట్టాలని అధికారులకు కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు. ప్రజల వినతుల పై స్పందించిన కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, అపార్ట్ మెంట్‌లో నివసిస్తున్న ప్రతి ఒక్కరి నుంచి వారి నివాస ఆధారాలను రెండు వారాల్లోగా సేకరించాలని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అనంతరం మౌలిక సదుపాయాల కల్పన పై ఆయన ఒక కీలక సూచన చేశారు. కాలనీ వాసులంతా ఏ బ్లాక్ కు ఆ బ్లాక్ గ్రూపుగా ఏర్పడి, ఒక బ్యాంకు ఖాతాను తెరవాలని తెలిపారు. ప్రతి నెలా నివాసితులు రూ 100 చొప్పున ఆ ఖాతాలో జమ చేసి, రాబోయే రోజుల్లో స్వయంగా తమ సొంత నిధుల తోనే అవసర మైన చిన్న చిన్న మౌలిక సదుపాయాలను నిర్వహించుకునే విధంగా భాగస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అనకాపల్లి జోనల్ కమిషనర్ కే. చక్రవర్తి, జీవీఎంసీ ఇతర సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సింగంపల్లి భానుచందర్, బొమ్మల దేవి, పైలా గోపి, పాటు పెద్ద ఎత్తున కాలనీవాసులు పాల్గొన్నారు.



# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు.

**భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.**

**కలెక్టర్ విజయ కృష్ణన్.**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 17:** పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, డి.ఆర్. ఓ., వై.సత్యనారాయణ రావు, జిల్లా పంచాయతీ అధికారి వి.సందీప్ లు జిల్లా లోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీలకు ఎండార్స్మెంట్ ఇచ్చి సంబంధిత అదికారులు వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పిజిఆర్ఎస్, శాఖల వారీ ప్రగతి సూచికలలో అనకాపల్లి జిల్లా కింద నుండి 3 వ స్థానంలో నిలిచిందని చెప్పారు. జిల్లా పనితీరు, ర్యాంకింగ్స్ వ్యత్యాసం ఇతర జిల్లాలలో 79% పైగా ప్రగతి సాధిస్తుంటే, ఈ జిల్లా కేవలం 60% పరిధి లోనే ఉందని పిటిషన్ల పరిష్కారంలో నాణ్యత లోపించడం, అర్జీదారులతో తగిన సమాచార మార్పిడి లేకపోవడం పై తీవ్ర అసంతృప్తి వ్యక్త చేశారు. డిఎం హెచ్‌ఓ/ డిసిహెచ్‌ఓ లు కలెక్టర్ల కాన్ఫరెన్స్ కోసం సేకరించాల్సిన 'డిపార్ట్ మెంట్ నోట్స్' సమర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అసహనం వ్యక్తం చేశారు. ల్యాండ్ సర్వే, ఆర్.ఓ.ఆర్ లు , ఈ -సర్వే, రీ-సర్వే అంశాలలో పురోగతి మరింత సాధించవలసి ఉందన్నారు. సీపీవో, సీనియర్ అధికారుల నుండి రావలసిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ నోట్స్‌ను తక్షణమే పూర్తి చేసి కలెక్టరేట్‌కు అందజేయాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ పిటిషన్ వచ్చినప్పుడు సంబంధిత అధికారి దరఖాస్తుదారునితో ఫోన్ చేసి మాట్లాడాలని, రాబోయే సమీక్ష నాటికి ప్రగతి శాతంలో మార్పు రాకపోతే పరిపాలనాపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. వివిధ అభివృద్ధి పారామీటర్లలో జిల్లా వెనుకబడి ఉండటం పై అధికారుల తీరుపట్ల తీవ్ర అసహనం వ్యక్తచేశారు. శాఖల వారీగా పనితీరు మెరుగుపడకపోవడం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పై అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. ప్రతి పారామీటర్‌కు సంబంధించిన పూర్తి నోట్స్ వివరాలను ఈరోజు సాయంత్రం లోగా పంపాలని ఆదేశించారు. పారామీటర్లను, పనితీరును మెరుగుపరుచు కోవాలని,

స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రధాని నరేంద్ర మోదీతో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు భేటీ.



**న్యూ ఢిల్లీ, ఆగస్టు 17:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీని మర్యాద పూర్వకంగా కలిశారు. గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ ప్రత్యేక భేటీ జరిగింది. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ప్రతిమను ప్రధాని నరేంద్ర మోదీ కి జ్ఞాపికగా అందజేశారు. సింహాచలం అప్పన్న స్వామి విశిష్టతను ప్రధానికి వివరించారు. అశోక్ గజపతి రాజు ఆరోగ్య పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యం పై ప్రత్యేకంగా ఆరా తీసి, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు సింహాచలం అప్పన్న స్వామి ని దర్శించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించారు. సింహాచలం వచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు ప్రధాని సుముఖత వ్యక్తం చేశారు. కాగా గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లతో భేటీ కానున్నారు.

## అనకాపల్లి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**జీవీఎంసీ కమిషనర్‌కు వినతి.**



**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 17:** జోన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి విచ్చేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కి అనకాపల్లి పట్టణంలో చేపట్టాల్సిన ముఖ్య మైన అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పై తక్షణ చర్యలు చేపట్టాలని కూటమి నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ దృష్టికి ప్రధానంగా ఎన్టీఆర్ విగ్రహం, ఫూల్‌బాగ్, నూకాంబిక ఆలయం, తోటాడ జంక్షన్ బైపాస్ రోడ్డు వరకు రహదారిని 50 అడుగులకు విస్తరించడంతో పాటు, ఫూల్‌బాగ్ రోడ్డు నుంచి వంద పడకల ఆసుపత్రి వరకు రహదారిని విస్తరించాలి అని తెలిపారు. జీవీఎంసీ భవనం, పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలం లోని కంపోస్ట్ యార్డును మరో ప్రాంతానికి తరలించి, అక్కడ ఆధునిక జీవీఎంసీ కార్యాలయ భవనాన్ని నిర్మించాలి అని కోరారు.

విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే బైపాస్ కూడలి, నాగులపల్లి కూడళ్లను ఆధునికంగా అభివృద్ధి చేసి సుందరీకరించాలి. అనకాపల్లి పట్టణం లోని పలు రోడ్లు, కాలువలను నిర్మించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి. జీవీఎంసీ పరిధి లోని పార్కులను ఆధునికీకరించి లైటింగ్, తాగునీటి సదుపాయం, చిన్నారుల ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి.

జీవీఎంసీ విలీన గ్రామాల్లోని రాజుపాలెం చెరువును అభివృద్ధి చేసి, చెరువుగట్ల సుందరీకరణ, లైటింగ్, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలి. జీవీఎంసీ 83 వ వార్డు ఏఎంసీ కాలనీ లోని భవనాలకు మరమ్మతులు చేపట్టి, అక్కడ నివసిస్తున్న గృహ యజమానుల పేర్ల పై మున్సిపల్ పన్ను విధించి ప్రాంతాన్ని సుందరీకరించాలి. జీవీఎంసీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న వాణిజ్య సముదాయాలు, కళ్యాణ మండపాలకు వేలం నిర్వహించి వినియోగం లోకి తీసుకురావాలి. రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి.

జీవీఎంసీ పరిధి లోని సులభ్ కాంప్లెక్స్‌లను ఆధునికీకరించి, వాటిని పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకురావాలి. ఈ సందర్భంగా పై అంశాల పై సమగ్రంగా పరిశీలించి, త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను, గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి, ఎన్టీఆర్ హాస్పిటల్ డైరెక్టర్ ఆళ్ల రామచంద్ర రావు, 80 వ వార్డు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బుద్ధ శ్రీనివాస రావు, బర్నికాన రాము, పెంటకోట గణేష్, మారిశెట్టి భాస్కర రావు, దాడి వాసు, కొణతాల సందీప్, పిల్లా సుధాకర్, కాండ్రేగుల గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పిహెచ్ పాఠశాలలో అభయ అవగాహన కార్యక్రమం.



పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 16:మెట్టపాలెం జెడ్పిహెచ్ పాఠశాలలో విద్యార్థిను లకు డబ్ల్యు ఎస్ఐ జి.ఎస్.వి. మహాలక్ష్మి ఆధ్వర్యంలో అభయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థినులకు శక్తి యాప్, అభయ డ్రాప్ బాక్స్ వినియోగం గురించి వివరించారు. తమకు ఎదురయ్యే వేధింపులు, సమస్యలు లేదా భద్రతకు సంబంధించిన విషయాలను భయపడకుండా అభయ డ్రాప్ బాక్స్ ద్వారా తెలియజేయవచ్చని అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించు కోవాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలు, పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, బాలికల పై వేధింపులు, సైబర్ భద్రత తదితర అంశాల పై అవగాహన కల్పించారు. బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు వెంటనే పోలీసుల సహాయం పొందాలని మహాలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థినులు, పాఠశాల అధ్యాపకులు, జిఏంఎస్కే లు పాల్గొన్నారు.

# దళితపేటల్లోని సమస్యలను పరిష్కరించాలి సిఐటియు

పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 17: సామాజిక శంఖారావం రాష్ట్ర వ్యాప్తంగా దళితుల పై వివక్షతకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు సర్వేలకు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా సోమవారం భరణికం, బాపడ పాలెం, పరవాడ గ్రామంలో సిఐటియు నాయకుడు గనిశెట్టి. సత్యనారాయణ పర్యయటన చేయడం జరిగింది. ఈ గ్రామాలలో ఎదుర్కొంటున్న సమస్యల పై దళితులును ఆరా తీయడం జరిగింది. పరవాడలో స్మశాన వాటిక దళితులకు లేకపోవడం విచారకరమన్నారు. బాపట్లపాలెంలో నీరు ప్రవహించే డ్రైనేజీ పూర్తిగా మూసుకుపోయిందని, పారిశు ద్ధ్యం అధ్వానంగా ఉందని తెలిపారు. ఇంటింటికో కుళాయిలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. భరణికం దళితపేటలో వీధిలైట్లు, కొళాయి నుండి నీరు రావడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.



# ఈ నెల 22, 23 తేదీల లో విశాఖలో బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సమావేశం.



**పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేయాలి**
**జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్.**

విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 17:బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సమావేశం-2026 (క్రీడా కార్యవర్గ సమావేశం, క్రీడా మంత్రుల సమావేశం) కు ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం నిర్వాహణకు సంబంధించిన ఏర్పాట్ల పై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీలలో విశాఖపట్నం లోని నోవోటెల్ హోటల్లో బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేసం జరుగుతుందని ,11 దేశాలకు సంబంధించిన మంత్రులు, అధికారులు ఈ సమావేశం లో పాల్గొంటున్నందున అంతర్జాతీయ స్థాయి కి తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం-2026 కోసం ఇతర దేశాలకు చెందిన మంత్రులు, డెలిగేట్స్ 21, 22 వ తేదీలలో నగరానికి చేరుకుని 24 వ తేదీ తిరిగి వెళతారని అన్నారు. విశాఖపట్నంలో ప్రత్యక్షంగా జరిగే ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి అవసర మైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశం క్రీడాభివృద్ధి, క్రీడా సాంకేతికత, క్రీడా పరిశ్రమ, సామర్థ్య నిర్మాణం, సాంప్రదాయ, దేశీయ క్రీడల ప్రోత్సాహం, పరి రక్షణ వంటి రంగాలలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుందని అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక మైన ఈ సమావేశానికి అంతర్జాతీయ ప్రముఖులు హాజరుకానున్నందున అంతర్జాతీయ కార్యక్రమాన్ని ఘనంగా, సముచితంగా నిర్వహించడానికి అవసర మైన చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమం సజావుగా, విజయవంతంగా జరిగేలా చూసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి బ్రిక్స్ సభ్య దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కి చెందిన క్రీడా మంత్రులు, అధికారిక ప్రతినిధులు సుమారు 50 నుండి 70 మంది ప్రముఖులతో పాటు కేంద్ర క్రీడల శాఖా మంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లేదా విద్యాశాఖ మంత్రి హాజరు కానున్నారని తెలిపారు. ఇతర మంత్రులు అంతర్జాతీయ సమావేశానికి సంబంధించిన ప్రారంభోత్సవం, ఇతర కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉందని వారికి విశాఖపట్నం లోని రాడిసన్ బ్లూ, నోవోటెల్ హోటల్లో వసతి ఏర్పాట్లు పూర్తి చేయాలని, భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లను పగడ్బందీగా ఏర్పాటుచేయాలని తెలిపారు. విజయనగరం జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని ఎయిర్ పోర్టు వద్ద స్వాగతం, రవాణా ఏర్పాట్లు, లైజన్ అధికారులు ఏర్పాటు, జీవీఎంసీ అధికారులు శానిటేషన్, టూరిజం అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖ పటిష్ట మైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అందరూ సమన్వయం తో పని చేయాలని తెలిపారు. 22 వ తేదీ రాత్రి నోవాటెల్ లో గాల డిన్నర్ లో పాల్గొంటారని, 23 వ తేదీ ఆర్కే బీచ్ లో సైకిల్ ర్యాలీ, కైలాసగిరి లో గ్లాస్ బ్రిడ్జి సందర్శన, మొక్కలు నాటే కార్యక్రమం, తొట్లకొండ, రుషికొండ బీచ్లలో పలు కార్యక్రమాల లో పాల్గొంటారని తెలిపారు. 23 వ తేదీ ఉదయం నోవాటెల్ లో స్పోర్ట్ వర్కింగ్ గ్రూప్ మీటింగ్ లో పాల్గొంటారు.

మినిట్ టు మినిట్ కార్యక్రమం ప్రకారం కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా రెవిన్యూ, పోలీసు, జి.వి.ఎం.సి., టూరిజం, సెట్విస్, క్రీడాశాఖ,అటవీశాఖ తదతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని, కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ చ మణికంఠ, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,సెట్విస్ సీఈఓ రమ్య, డిఎస్డిఓ గాలియట్ జీవీఎంసీ అడిషనల్ కమీషనర్ నల్లనయ్య, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీయుడబ్ల్యూజే 70 వ ఆవిర్భావ దినోత్సవం






యలమంచిలి పెన్ సత్తా, ఆగస్ట్ 17:. యలమంచిలి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయుడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలో విలేకరులు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ?ఉత్సవాల్లో భాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి, పారితోషికాలు అందజేశారు. ?ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ గుమ్మల గోవిందరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రుద్ర సింహాచలం (చిట్టిబాబు) మాట్లాడుతూ... సమాజంలో పత్రికా విలేకరులకు విశిష్టమైన గౌరవం ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని తెలిపారు. సమాజంలోని లోటుపాట్లను ఎత్తిచూపుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విలేకరుల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. గత 70 ఏళ్లుగా ఏపీయుడబ్ల్యూజే సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తోందని, జర్నలిస్టులు ఎల్లప్పుడూ సమాజ హిత కోసమే పనిచేయాలని పిలుపునిచ్చారు. ?ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఆడారి గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పోలిశెట్టి శ్రీమన్, మూర్తి, నాయుడు, కిషోర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు దుబాశ రమణ, దాట్ల సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు గణేష్, సహకార్యదర్శి సంతోష్, సీనియర్ పాత్రికేయులు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, శేషగిరి, చిన్నాజీ, శివ, రాము, లోకేష్ మరియు ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు ఏళ్ల నమ్మకము అభివృద్ధి సంక్షేమము ఇంటింటికి.

**గొల్లగండిలో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం**





సోంపేట , పెన్ సత్తా, ఆగస్ట్ 17:
సోంపేట మండలంలోని గొల్లగండి పంచాయితీలో సోమవారం"రెండు ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి" కార్యక్రమం టిడిపి నాయకులు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు తెప్పల. కోదండరావు,నిట్ట.గోపాల్ గ్రామస్తులుతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.దీనబంధు, కృష్ణమూర్తి,గణేష్ మరియు మహిళలు,పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్య జ్యోతి పథకం పారితోషికాలు పంపిణీ.




పరవాడ , పెన్ సత్తా, ఆగస్ట్ 17: ; కెనరా బ్యాంక్ పరవాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పరవాడ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కెనరా విద్య జ్యోతి పథకం కింద పారితోషికాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అర్హులైన విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం ద్వారా మంజూరైన పారితోషిక మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి చదువులో మరింత ముందుకు సాగేందుకు ఇటువంటి ప్రోత్సాహక పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని బ్యాంకు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి బ్యాంకు అందిస్తున్న సహకారాన్ని ఉపాధ్యాయులు ప్రశంసించారు.

## ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పరవాడ ప్రెస్ క్లబ్.








పరవాడ , పెన్ సత్తా, ఆగస్ట్ 17::ఏపీయూడబ్ల్యూజే పరవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా 70 వ ఆవిర్భావ దినోత్సవ సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక బాలికల ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో జర్నలిజం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ లోకేష్, శివాజీ, గౌరవాధ్యక్షులు రవి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు విశ్వనాథం, సభ్యులు బాబు, జగదీష్, గణేష్, శ్రీను, కన్నబాబు, సునీల్, ఈశ్వరరావు, చందు, మోహన్, విందుల మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో

# భారత్ స్వయం సమృద్ధి

భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం సరికొత్త చరిత్ర దిశగా అడుగులేస్తోంది. ఇప్పటివరకు కేవలం స్మార్ట్‌ఫోన్లు, టీవీలు వంటి ఉత్పత్తుల్ని అసెంబుల్ చేయడానికి పరిమితమైన భారత్, ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, ముడి పదార్థాల తయారీలోనూ వేగంగా స్వయం సమృద్ధి సాధిస్తోంది. తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటోంది. కీలక ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీతో దేశీయ అవసరాల్ని దాదాపు పూర్తిగా తీర్చే స్థాయికి భారత్ చేరుకుంటోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అనేక ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో 100 శాతం ఆత్మనిర్భరత సాధించిందని లేదా పూర్తి స్వయం సమృద్ధికి అత్యంత చేరువలో ఉందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (జుజమీా) కింద 5వ విడత అనుమతుల మంజూరు కార్యక్రమంలో మంత్రి - పరిశ్రమ ప్రతినిధుల్ని ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో స్థానిక విలువను పెంచడం, కీలక కాంపోనెంట్ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, అధునాతన తయారీ సామర్థ్యాల్ని అభివృద్ధి చేయడం ఈ జుజమీా పథకం ప్రధాన లక్ష్యాలు.

దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ గతంతో పోలిస్తే గణనీయంగా విస్తరించిందని ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఎన్‌క్లోజర్లు, రిలేలు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్ రంగాల్లో భారత్ 100 శాతం స్వదేశీ సామర్థ్యాన్ని సాధించిందని, వాటిని ఇంకా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు. ముఖ్యంగా తయారీ రంగానికి ప్రధాన కేంద్రంగా ఉన్న చైనాకు కూడా భారత్ నుంచి పీసీబీల (ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్) ఎగుమతులు ప్రారంభం కావడం అభినందించదగిన



విషయమని కొనియాడారు. అశ్విని వైష్ణవ్ వెల్లడించిన వివరాల ప్రకారం, లామినేట్లలో 80 శాతం డిమాండ్‌ను స్వదేశీ తయారీ ద్వారానే భారత్ తీర్చుకుంటోంది. ప్రస్తుత విస్తరణతో త్వరలోనే ఇందులోనూ 100 శాతం ఆత్మనిర్భరత సాధించనున్నాం. ఆప్టికల్ కనెక్టర్లకు సంబంధించి దేశీయ డిమాండ్‌లో 75 శాతం సాధించాం. గతంలో భారత్‌లో అసలు తయారు చేయలేని స్థితి నుంచి ప్రస్తుతం దేశ అవసరాల్లో 60 శాతం లిథియన్ అయాన్ సెల్స్‌ను దేశీయంగా తీర్చే స్థాయికి భారత్ చేరుకుంది. ఇతర కాంపోనెంట్ల విషయానికి వస్తే ట్రాన్స్‌డ్యూసర్లలో 55 శాతం, ఎలక్ట్రానిక్స్‌కు అవసరమైన పర్మనెంట్ మ్యాగ్నెట్లలో 40 శాతం, కెపాసిటర్లలో 20 శాతం దేశీయ సామర్థ్యం సాధించినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

**106 ప్రాజెక్టులు- 74 వేలకుపైగా ఉద్యోగాలు**

విడిభాగాలు, ముడి సరకుల తర్వాత ఎలక్ట్రానిక్స్ రంగానికి అవసరమయ్యే 'క్యాపిటల్ ఎక్విప్‌మెంట్ (యంత్రాలు, తయారీ పరికరాలు)' స్వదేశంలోనే తయారు చేయడం తదుపరి లక్ష్యమని మంత్రి అశ్విని వైష్ణవ్ నొక్కిచెప్పారు. సోమవారం రోజు దేశీయ క్యాపిటల్ ఎక్విప్‌మెంట్ తయారీకి సంబంధించి 2 కంపెనీలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల పథకం జుజమీా కింద కేంద్రం తాజాగా రూ. 7877 కోట్లతో 31 కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు ఆమోదం పొందిన ప్రాజెక్టుల సంఖ్య 106కు చేరగా, వీటి మొత్తం పెట్టుబడులు రూ. 69 వేల కోట్లు దాటాయి. వీటిల్లో 38 ప్రాజెక్టులు ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. మరో 16 నిర్మాణంలో ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఇక దీని ద్వారా ఇప్పటివరకు 74 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు, దాదాపు 2.5 లక్షల పరోక్ష ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

**పరిశ్రమ ముందు 4 ప్రధాన లక్ష్యాలు**

భారత ఎలక్ట్రానిక్స్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు పరిశ్రమ అత్యవసరంగా దృష్టి పెట్టాల్సిన నాలుగు ప్రధాన అంశాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. ఆయన ప్రకారం, ముందుగా కేవలం అసెంబ్లింగ్ మాత్రమే కాకుండా, స్పెషలైజ్డ్ డిజైనింగ్ సామర్థ్యాలను గణనీయంగా పెంచుకోవాలి. రెండోది పూర్తి స్థాయి దేశీయ సప్లై చెయిన్‌ను నిర్మించడం. ఇక్కడ ప్రతి చిన్న విడిభాగం వరకు భారతదేశంలోనే తయారు చేయాలి. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నాణ్యతలో రాజీ పడని సంస్కృతిని పెంపొందించుకోవాలి. తయారీ రంగంలో ప్రతిభ కలిగిన కార్మికుల కొరత రాకుండా శిక్షణా కార్యక్రమాల్ని 10 రెట్లు పెంచాలి.

# పంద్రాగస్టు వేళ భారీ ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టాం

ఉగ్రవాదంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. టెర్రరిజం పట్ల భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తూ 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్లలో దేశ భద్రతా సంస్థలు స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే ఐఎస్ఐ మద్దతు గల, పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు వెల్లడించారు. షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు చెందిన 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేశామని పేర్కొన్నారు. తద్వారా విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేశామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో అమిత్ షా పోస్ట్ పెట్టారు.

"దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు మోదీ సర్కార్ 200 మందికి పైగా షహజాద్ భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్టు చేసింది. ఈ క్రమంలో ఐఎస్ఐ మద్దతుగల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసింది. విధ్వంసక దాడులకు షహజాద్ భట్టి నెట్‌వర్క్ వేసిన ప్రణాళికలను భగ్నం చేసింది. ఉగ్రవాదం పట్ల భారత్‌కు ఉన్న జీరో టాలరెన్స్‌కు ఇదొక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. భారత భద్రతా దళాలు 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో కూడిన ఆపరేషన్లను ప్రారంభించి షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను చిన్నాభిన్నం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ సంస్థ నుంచి ఐఈడీలు, పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టల్స్, తూటాలు, గూఢచర్యానికి ఉపయోగించే సీసీటీవీ కెమెరాలతో సహా భారీ మొత్తంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. షహజాద్ భట్టి నెట్‌వర్క్



అనేక ఉగ్రవాద కార్యకలాపాలలో పాలుపంచుకుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకారం**

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐఎస్ఐ మద్దతు గల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు దేశంలో జరిగిన గ్రనేడ్, ఐఈడీ, పెట్రోల్ బాంబు దాడులు, లక్షిత హత్యలతో సంబంధం ఉంది. పోలీసులు, రక్షణ, మతపరమైన ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించడానికి, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి స్థానిక మధ్యవర్తులకు ఈ నెట్‌వర్క్ డబ్బు ఇస్తోంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ (ఉపా) చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద షహజాద్ భట్టి గ్యాంగ్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సీమాంతర ఉగ్రవాదం పట్ల దేశ జీరో టాలరెన్స్ విధానంలో భాగంగా 14 రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌కు చెందిన 253 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ (62), హరియాణా (52), దిల్లీ (51), పంజాబ్ (44), రాజస్థాన్ (15), మహారాష్ట్ర (8), ఉత్తరాఖండ్ (5), కర్ణాటక, గుజరాత్, బిహార్‌లో చెరో ముగ్గురు, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కేరళలో చెరో ఇద్దరు భట్టి నెట్‌వర్క్ ఆరరేటివ్‌లను అరెస్ట్ చేశారు.

**గ్యాంగ్‌స్టర్ టు టెర్రరిస్ట్**

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు ఉగ్రవాద గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్ కేసులకు సంబంధించి ఎన్ఐఏ ఇటీవలే పంజాబ్, హరియాణాలలో 18 చోట్ల సోదాలు చేపట్టింది. ఉగ్ర కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించేందుకు కొంత మందిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టింది. ఈ మూడు కేసుల్లో ఎన్ఐఏ నిఘాలో ఉన్న వ్యక్తుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారంతో పాటు, పలు డిజిటల్ డివైజ్‌లు, పత్రాలను కూడా ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దుల అవతల జరుగుతున్న భారీ కుట్రను ఛేదించేందుకు సోదాల సమయంలో సేకరించిన సమాచారం, సాక్ష్యాలను ఫోరెన్సిక్, సాంకేతిక పరీక్షల కోసం పంపారు. గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన షహజాద్ భట్టి నడుపుతున్న నెట్‌వర్క్ వెనుక ఉన్న భారీ కుట్రను ఛేదించే లక్ష్యంతో సాగుతున్న దర్యాప్తులో భాగంగా తదుపరి విచారణ కోసం కొందరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

# బీజేపీ నూతన జాతీయ కార్యవర్గం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో పనిచేయనున్న కొత్త కార్యవర్గంలో అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళలకు కూడా గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు. నబీన్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి దాదాపు ఆరు నెలల తర్వాత కొత్త టీమ్‌ను ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ కార్యదర్శులుగా 16మందికి అవకాశం కల్పించగా, పురందేశ్వరి సహా 13మంది ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. అయితే ఈ టీమ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి చోటుదక్కగా, తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం లభించలేదు. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా బీఎల్ సంతోష్ తన పదవిలోనే కొనసాగనున్నారు. అమేఠీ మాజీ ఎంపీ స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాకు జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కీల బాధ్యతలు అప్పగించారు.

**ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు**

పార్టీలో కీలకమైన జాతీయ ఉపాధ్యక్ష పదవులకు పలువురు సీనియర్ నేతలను నియమించారు. మాజీ రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ జయ్ పాండా, ఆంధ్రప్రదేశ్?కు డీ పురందేశ్వరి, రేఖా వర్మ తదితరులకు ఈ బాధ్యతలు దక్కాయి. మొత్తం 13 మంది కొత్త జాతీయ ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం ప్రత్యేకంగా నిలిచింది. వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ప్రొఫెసర్ ఎం. నాగరాజ, ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్ తదితరులు కూడా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

**జాతీయ కార్యదర్శులుగా 16 మందికి చోటు**



జాతీయ కార్యదర్శుల జాబితాలోనూ పలు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించారు. మధ్యప్రదేశ్ నుంచి కవితా పటిదార్, కేరళ నుంచి కె. సురేంద్రన్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి డాక్టర్ భోలా సింగ్, జార్ఖండ్ నుంచి ప్రదీప్ వర్మ, గుజరాత్ నుంచి జగదీశ్ ఇశ్వర్‌భాయ్ పటేల్ నియమితులయ్యారు. దిల్లీ నుంచి సందీప్ పాఠక్, స్వదేశ్ సింగ్, జై ప్రకాశ్, నాగాలాండ్ నుంచి ఫాంగ్నోన్ కొన్యాక్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి సంగీత యాదవ్, కేరళ నుంచి అనిల్ ఆంటోనీ, తమిళనాడు నుంచి ఎం. వెంకటేశన్, బంగాల్ నుంచి మనోజ్ టిగ్గా, బిహార్ నుంచి సిద్ధార్థ్ శంభు, అసోం నుంచి మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్ నుంచి రోహన్ గుప్తాకు జాతీయ కార్యదర్శుల బాధ్యతలు అప్పగించారు.

**పీయూష్ గోయల్‌కు మరోసారి**

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు మరోసారి బీజేపీ జాతీయ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఆర్థిక వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్ ఎంపీ హేమాంగ్ జోషికి బీజేపీ యువమోర్చా బాధ్యతలు అప్పగించగా., ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరీ మహిళా మోర్చాను పర్యవేక్షించనున్నారు.

**మీడియా, సోషల్ మీడియా టీమ్‌లోనూ మార్పులు**

బీజేపీ మీడియా విభాగంలోనూ కీలక బాధ్యతలను ఖరారు చేసింది. లోక్‌సభ ఎంపీ అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశిశ్ ఉషా అగర్వాల్, దిల్లీకి చెందిన ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ కో-కన్వీనర్లుగా వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌కు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. పార్టీ ప్రచార వ్యూహాల్లో సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

**కొత్త టీమ్‌కు మోదీ అభినందనలు**

ఇదిలా ఉండగా, బీజేపీ నూతన కార్యవర్గ సభ్యులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. బీజేపీని బలోపేతం చేయడంలోనూ, ప్రజా సేవపై దృష్టి సారించడంలోనూ ఈ కొత్త బృందం తమ వంతు ఉత్తమ కృషి చేస్తుందనే నమ్మకం ఉందని అన్నారు. అలాగే క్షేత్రస్థాయి ప్రజలతో అనుబంధాన్ని కలిగి ఉంటుందని ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇక నితిన్ నబీన్ కొత్త టీమ్‌కు ముందున్న అతిపెద్ద సవాలు 2027 అసెంబ్లీ ఎన్నికలే. ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు కీలక రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచడం, సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం కొత్త టీమ్‌కు కీలకంగా మారనుంది.

## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

పరీక్షల అవకతవలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం సోమవారం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టీడీపీఎల్ సంస్థ 2014 నుంచి నిర్వహించిన పరీక్షలు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాదు, విద్యార్థుల ప్రయోజనాల కోసం కఠినమైన చట్టం తీసుకొస్తామని సీఎం హేమంత్ సోరెన్ వెల్లడించారు. టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టీడీపీఎల్) సంస్థ 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్? ప్రకటించారు. "2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని చిన్న, పెద్ద పొరపాట్లు అన్నింటిపై సమగ్రంగా విచారణ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం. అవసరమైతే ఈ అంశంపై చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. సిట్?, సీఐడీ చేసిన దర్యాప్తులో అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ప్రస్తుతం ఇంకా విచారణ కొనసాగుతున్నందన, ప్రతి విషయాన్ని బహిరంగా వెల్లడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?



అణు ప్రమాదం సంభవించినప్పుడు బాధితులకు సరైన, న్యాయమైన నష్టపరిహారాన్ని అందించకుండా దేశంలోని కోర్టులను శాంతి చట్టం నిరోధిస్తుందా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈమేరకు పరిమిత నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశించింది. మాజీ అధికారి ఈఏఎస్ శర్మ నేతృత్వంలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలతో కూడిన పిటిషనర్ల బృందం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శాంతి చట్టం- 2025 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 కింద ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ బృందం తరఫున హాజరైన న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నేహా రాఠీ వాదనలు వినిపిస్తూ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్లాంట్ నిర్వాహకుల ఆర్థిక బాధ్యతపై ఈ చట్టం గరిష్ట పరిమితిని విధిస్తోందని వాదించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, ఈ చట్టంపై ప్రజల్లో చాలా ఆందోళనలు, అపోహలు ఉన్నాయని అన్నారు. నిర్వాహకుల బాధ్యతపై పార్లమెంటు పరిమితి విధించినప్పటికీ, న్యాయమైన, సరైన నష్టపరిహారం ఇవ్వకుండా అది కోర్టును నిరోధించదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్వాహకులను ప్రోత్సహించడానికి, దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించడానికి మాత్రమే పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిందని ఆయన గుర్తుచేశారు. అణుశక్తి కమిషన్ ఏర్పాటు చేసిన సెర్చ్?, ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు, శాంతి చట్టంలోని సెక్షన్ 17 (4) కింద అణుశక్తి నియంత్రణ సంస్థ (ఏఈఆర్‌బీ) సభ్యుల నియామకంపై తన వైఖరిని స్పష్టం చేయాలని ధర్మాసనం కేంద్రాన్ని కోరింది.

అయితే, ఈ నిబంధనల వల్ల నిర్వాహకులు భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహించే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ న్యాయస్థానానికి వివరించారు. దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలను నడపడానికి అణుశక్తి కమిషన్ బాధ్యత వహిస్తుందని, అది నియంత్రణ సంస్థకు సభ్యులను సిఫార్సు చేయలేదని, అలా చేయడం ప్రయోజనాల సంఘర్షణ అవుతుందని భూషణ్ అన్నారు.

2010 నాటి అణు విద్యుత్ బాధ్యత పౌర బాధ్యత చట్టం స్థానంలో వచ్చిన సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (’ానాూచీ×) చట్టం, ప్రైవేట్ కంపెనీలను పౌర అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అనుమతిస్తుంది. కానీ అణు విద్యుత్ ప్లాంట్‌లో ఏదైనా దురదృష్టకర ప్రమాదం జరిగినప్పుడు రూ. 3,000 కోట్లకు మించిన బాధ్యత నుంచి వాటికి మినహాయింపు ఇస్తుంది. ఈ చట్టంలోని వివిధ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు "ఆర్థిక విధానానికి" సంబంధించినవని అత్యున్నత న్యాయస్థానం మే 19న పేర్కొంది.

ఇదిలా ఉండగా, అణు నష్టం కోసం బీమా పాలసీ, ఆర్థిక భద్రత లేదా రెండింటిని నిర్వహించాలని అణు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ (శాంతి) చట్టం 2025 డ్రాఫ్ట్ నియమాలను న్యూక్లియర్ ప్లాంట్ ఆపరేటర్లు పాటించాలని సూచించింది. సంబంధిత స్టోరేజీ పూల్ నుంచి ఇంధనాన్ని తొలగించే వరకు ఆర్థిక భద్రత అమలులో ఉండాలని కూడా ముసాయిదా నిబంధనలు పేర్కొంటున్నాయి. ముసాయిదా నిబంధనల ప్రకారం, కేంద్రం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి, అణు నష్టం కోసం ఆపరేటర్ పౌర బాధ్యత, గరిష్ట పరిమితులను సమీక్షించడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి.

## పప్పుధాన్యాల రైతులకు గుడ్‌న్యూస్ దిగుబడి 15 శాతానికి పెంచేలా శాస్త్రవేత్తల కొత్త టెక్నిక్

పప్పుధాన్యాల సాగు చేసే రైతులకు శాస్త్రవేత్తలు శుభవార్తను అందించారు. తక్కువ ఖర్చుతో పంట దిగుబడిని పెంచే కొత్త టెక్నాలజీని ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్?స్టిట్యూట్? ఆఫ్? పల్సెస్ రీసెర్చ్ (ఐఐపీఆర్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రైజోబియం, ఫాస్ఫరస్?ను కరిగించే బ్యాక్టీరియా మిశ్రమాన్ని రూపొందించారు. దీనిని పొలాల్లో నేరుగా విత్తనాలను శుద్ధి చేయడానికి ఉపయోగించవచ్చు. దీని వల్ల పప్పుధాన్యాల దిగుబడిని 10 నుంచి 15 శాతం వరకు పెంచవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎరువుల కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ పరిశోధన ప్రాధాన్యతను సంతరించుకుంది. వాతవరణంలో దాదాపు 79 శాతం నత్రజని ఉంటుంది. కానీ మొక్కలు దాన్ని నేరుగా వినియోగించుకోవలేవు. ఈ సమయంలో రైజోబియం వంటి ప్రయోజనకరమైన బ్యాక్టీరియా నత్రజనిని గ్రహించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి మొక్కల వేర్లపై కణుపులు ఏర్పరిచి వాతావరణంలోని నత్రజనిని గ్రహించేలా చేస్తాయి. ఫలితంగా మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుంది. అదేవిధంగా, ఫాస్ఫరస్ సోల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్?బీ) నేలలో ఉంటే భాస్వరాన్ని మొక్కలు సులభంగా గ్రహించే రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. ఈ రెండు రకాల ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను కలిపి వినియోగించడం వల్ల మొక్కల పెరుగుదల మరింత మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

'దిగుబడి 10-15 శాతం పెరగొచ్చు'

రైబోబియం, ఫాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా కలిసి పనిచేయడం వల్ల మొక్కల ఎదుగుదల గణనీయంగా మెరుగవుతుందని చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ అఖిలేశ్ మిశ్రా తెలిపారు.

## సంపాదకీయం

# ఒత్తిడిలో ట్రంప్!

అమెరికా–ఇరాన్ యుద్ధం ఆరు నెలలు దాటుతున్న తరుణంలో, వాషింగ్టన్‌లో అంతర్గత గందరగోళం, ఒత్తిడి తారాస్థాయికి చేరుకున్నట్టు స్పష్టమవుతోంది. ఆగస్టు 16న అమెరికా మాజీ కాంగ్రెస్ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీకి చెందిన మార్జోరీ టేలర్ గ్రీన్ చేసిన సంచలన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. "వ్యూహాత్మక సమావేశాల్లో ఇరాన్‌పై అణ్వాయుధాల వినియోగంపై చర్చిస్తున్నారు. నేను ఊహించి చెప్పడం లేదు, నాకిది ఖచ్చితంగా తెలుసు, ఇది నిజం" అని ఆమె 'ఎక్స్' వేదికగా ఆదివారం పేర్కొన్నారు. అణుదాడులు జరిగితే ప్రపంచం మొత్తం భారీ సంఘర్షణలోకి, తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి జారిపోయే ప్రమాదముందని హెచ్చరించిన ఆమె, 1945లో హిరోషిమా, నాగసాకిపై అణుదాడుల అనంతర పరిణామాలను గుర్తుచేస్తూ –ఇన్నేళ్లు గడిచినా జపాన్ ప్రజలు ఇప్పటికీ రేడియేషన్ వ్యాధులు, క్యాన్సర్, పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నారని ప్రస్తావిస్తూ –అణుదాడులకు వ్యతిరేకంగా అమెరికన్లు గళం విప్పాలని పిలుపునిచ్చారు. అమెరికా, హర్మూజ్ జలసంధి నియంత్రణ కోసం, ఇజ్రాయెల్ హెచ్చరికల ఒత్తిడితో అణు ప్రమాణాన్ని తగ్గించే యోచనలో ఉందని ఆమె ఆరోపించారు. శ్వేతసౌధం నుంచి ఇప్పటివరకూ దీనిపై అధికారిక స్పందన రాలేదు. ఇరాన్ అణ్వాయుధం తయారీకి చేరువలో లేదని అమెరికా నిఘా వర్గాల 2025 వార్షిక ముప్పు అంచనా నివేదికే స్పష్టం చేసినా, ప్రభుత్వం ఇజ్రాయెల్ నుంచి వస్తున్న హెచ్చరికల ప్రభావంతో ప్రభావితమవుతోందని గ్రీన్ ఆరోపించారు.


ఒకప్పుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా, మాగా ఉద్యమంలో కీలక నేతగా ఉన్న గ్రీన్, –ఇరాన్ అణ్వాయుధాల తయారీకి చేరువలో ఉందన్న వాదన కేవలం మిషేనిని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఆమెతోపాటు కెంటుకీకి చెందిన సెనేటర్ ర్యాండ్ పాల్ వంటివారు కూడా 'మరో ముందస్తు యుద్ధం' మొదలైందని విమర్శించగా, కాంగ్రెస్ ఆమోదం లేకుండా యుద్ధం మొదలుపెట్టడాన్ని రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ సభ్యుడు థామస్ మ్యాసీ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో, యుద్ధ వాతావరణంలో నకిలీ వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెంది, అంతర్జాతీయ దౌత్యాన్నే కలవరపెట్టగలవో చూపించే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఆగస్టు 5న భారత్‌లోని ఒక ఎక్స్ ఖాతానుంచి, ఇరాన్ ఐఆర్‌జీసీ కమాండర్ బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వాహిది అణుబాంబు తయారీని అంగీకరించినట్టు చూపే ఒక పోస్టు వైరల్ అయింది. ఇజ్రాయెల్, అమెరికా అణ్వాయుధాలను కలిగి ఉన్నంతకాలం తాము తమ అణు ప్రయత్నాలను వదులుకోబోమని ఆయన చెప్పినట్టు ఆ పోస్టులో పేర్కొనగా, దానికి ఏఐ రూపొందించిన అణు పరీక్ష పొగ చిత్రాన్ని కూడా జోడించారు. ఇది క్షణాల్లో ఇజ్రాయెల్ మీడియా అందిపుచ్చుకుని, తాము అణుబాంబును తయారు చేస్తున్నామని ఇరాన్ తొలిసారి బహిరంగంగా అంగీకరించిందని ప్రసారం చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్వయంగా దీన్ని ఇరాన్ ఉద్దేశాలకు రుజువుగా అభివర్ణించారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్, సెనేటర్ రిక్ స్కాట్‌వంటి ప్రముఖులు కూడా ఈ పోస్టును షేర్ చేయడంతో, అమెరికా ప్రధాన మీడియాలో దీనిపై కథనాలు ప్రసారమయ్యాయి. అయితే, 'ది టైమ్స్' ఫ్యాక్ట్–చెక్‌లో ఇది పూర్తిగా నకిలీదని తేలింది. దీనిపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తమపై సాగుతున్న దుష్ప్రచారానికి ఇది మరో నిదర్శనమని, రెండు దశాబ్దాలుగా సైనిక చర్యను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ఇలాంటి కుట్రలు పన్నుతూనే ఉందని మండిపడ్డారు. నిజం బయటపడిన వెంటనే మైక్ వాల్జ్ తన పోస్టు తొలగించారు.

ఈ రెండు ఘటనలను కలిపి చూస్తే, ట్రంప్ పరిపాలన ఎదుర్కొంటున్న బహుముఖ ఒత్తిడి స్పష్టం. ఒకవైపు సొంత పార్టీలోనే యుద్ధ వ్యతిరేక స్వరాలు బలంగా వినిపిస్తున్నాయి, మరోవైపు యుద్ధాన్ని సమర్థించే వర్గం మాత్రం దీన్ని 'చారిత్రక నాయకత్వ నిర్ణయం'గా అభివర్ణిస్తోంది. యుద్ధం మొదలైనప్పుడు సెనేటర్ లిండ్సే గ్రాహం, కేటీ బ్రిట్ వంటివారు పూర్తి మద్దతు ప్రకటించగా, గ్రీన్ వంటివారు మాత్రం మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ విభజన కేవలం రాజకీయ చర్చకే పరిమితం కాదు –యుద్ధం ఆరు నెలలు దాటినా ముగింపు కనిపించకపోవడం, ఆయుధ నిల్వలు తరిగిపోవడం, చమురు ధరలు, ద్రవ్యోల్బణం పెరగడం వంటి వాస్తవ సమస్యలు ట్రంప్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ మొదట్లో ఇరాక్ తరహా సుదీర్ఘ యుద్ధంలో అమెరికా చిక్కుకునే అవకాశమే లేదని హామీ ఇచ్చినా, ఆరు నెలలు గడిచినా యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉండటం, ఆ హామీపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇలాంటి తరుణంలోనే, నిర్ధారణ లేని ఆరోపణలు, నకిలీ వార్తలు వేగంగా వ్యాప్తి చెందడం, పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖతామీ చెప్పినట్టు, "యుద్ధం కొనసాగినంత కాలం ప్రజలు భయంతోనే జీవించాల్సి ఉంటుంది" అన్న మాట ఇరు దేశాల ప్రజలకూ వర్తిస్తుంది. బాహ్య ఒత్తిడిని ఇన్నాళ్లు తట్టుకున్న ప్రభుత్వం, యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ వద్ద అణ్వాయుధాలు ఉన్నంతకాలం తామూ వాటిని సమకూర్చుకుంటూనే ఉంటామని ఇరాన్ సీనియర్ కమాండర్ జనరల్ వాహిది వ్యాఖ్యానించడం, రెండు వైపులా అణు అంశంపై పట్టువిడుపు ధోరణి కనిపించడం లేదని స్పష్టం చేస్తోంది.

ఈ మొత్తం పరిణామాల నుంచి ఒక స్పష్టమైన సందేశం వెలువడుతోంది – దీర్ఘకాలం సాగుతున్న యుద్ధం, కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగలడం లేదు, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిని, భయాన్ని, తప్పుడు సమాచార ప్రవాహాన్ని రేకెత్తిస్తోంది. అదే సమయంలో, ఒక సాధారణ సోషల్ మీడియా పోస్టు, ప్రధాని స్థాయి వ్యక్తులను, రాయబారులను సైతం తప్పుదోవ పట్టించగలిగింది. ఇలాంటి పరిస్థితుల్లో, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ప్రకటనలు చేయడం, వాటిని వ్యాప్తి చేయడం అత్యంత ప్రమాదకరం –ఇది యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయగల, అనవసర ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశముంది. ట్రంప్ పరిపాలన నిజంగా ఏం చేయాలనుకుంటోందో స్పష్టతలేని ఈ తరుణంలో, సొంత పార్టీనుంచే వస్తున్న హెచ్చరికలు, అంతర్జాతీయంగా వ్యాపిస్తున్న నకిలీ వార్తలు రెండూ కలిసి, అమెరికా విదేశాంగ విధానంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. శాంతి దిశగా నిజాయితీతో కూడిన అడుగులు వేయకపోతే, ఇలాంటి గందరగోళం మరింత ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం లేకపోలేదు.

---

## పనికొచ్చే పలుకు



# ఈ టాప్ సీక్రెట్ మీకు తెలుసా?

డబ్బు లేకుండా, సమయం వెచ్చించకుండా, ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండా, క్షణాల్లో శరీరాన్ని, మనసును సానుకూలంగా మార్చే అద్భుతమైన రహస్యం తెలుసా? అదే –చిరునవ్వు. "నవ్వడానికి అవకాశాన్ని క్రియేట్ చేసుకోండి, ఆ నవ్వును నలుగురితో పంచుకోండి" అని ప్రముఖ అమెరికన్ రచయిత నీల్ డొనాల్డ్ వాల్ష్ చెప్పిన మాటల వెనుక లోతైన శాస్త్రీయ సత్యం దాగివుంది. చిన్న చిరునవ్వు శరీరంలోని రసాయనిక వ్యవస్థను (ఫిజియోలాజికల్ కెమిస్ట్రీ) సానుకూలంగా మారుస్తుందని ఆయన అన్న మాట కేవలం ఆధ్యాత్మిక ఉపదేశం కాదు, ఆధునిక వైద్యశాస్త్రం కూడా.

మనం నవ్వినప్పుడు మెదడులో ఎండార్ఫిన్లు, డోపమైన్, సెరోటోనిన్ వంటి 'హ్యాపీ హార్మోన్లు' విడుదలవుతాయి. ఇవి మనసును తేలికపరచడమే కాదు, శరీరంలో నొప్పిని తగ్గించే సహజ నొప్పి నివారిణులుగా పనిచేస్తాయి. అదే సమయంలో ఒత్తిడి హార్మోన్లైన కార్టిజాల్, అడ్రినలిన్ స్థాయిలు తగ్గిపోతాయి. ఆసక్తికరమైన విషయమేమిటంటే, నిజంగా సంతోషంగా ఉండి నవ్వినా, లేదా కేవలం ముఖ కండరాలను నవ్వు భంగిమలో ఉంచినా, రెండు సందర్భాల్లోనూ మెదడు దాదాపు ఒకేలా స్పందిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నే 'ఫేషియల్ ఫీడ్‌బ్యాక్ హైపోథెసిస్' అంటారు. అంటే, మీకు నవ్వు రాకపోయినా, కావాలని కాసేపు నవ్వితే కూడా శరీరం సానుకూలంగా స్పందిస్తుంది. ఇక నవ్వును నలుగురితో పంచుకోవాలన్న వాల్ష్ సూచన వెనుక మరో గొప్ప సత్యముంది. నవ్వు అంటువ్యాధిలా వ్యాపిస్తుంది. మీరు నిజాయితీగా నవ్వినప్పుడు, చుట్టూ ఉన్నవారి మెదడులోని 'మిర్రర్ న్యూరాన్లు' ప్రతిబింబిస్తాయి, వారు కూడా అప్రయత్నంగా నవ్వుతారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రయోజనమే కాదు, సామాజిక బంధాలను బలపరిచే శక్తివంతమైన సాధనం కూడా. ఒక కార్యాలయంలో, కుటుంబంలో, స్నేహితుల మధ్య నవ్వు పంచుకోవడం వల్ల నమ్మకం పెరుగుతుంది, ఒత్తిడి తగ్గుతుంది, సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. తెలుగు సాహిత్యంలోనూ నవ్వు గొప్పతనాన్ని కీర్తించిన సందర్భాలు కోకొల్లలు. ఒక ప్రసిద్ధ సూక్తి ఇలా చెబుతుంది – "నవ్వుతూ బతకాలి, నవ్విస్తూ బతకాలి" అని పెద్దలు అనేవారు. నవ్వుల రేడు చార్లీ చాప్లిన్ కూడా ఇలా అన్నాడు: *A day without laughter is a day wasted.* అంటే, నవ్వు లేని రోజు వృథా అయిన రోజే. ఈ మాటలు కేవలం భావోద్వేగపరమైన ఓదార్పు కోసం చెప్పినవి కావు, జీవన విధానాన్ని మార్చే శక్తివంతమైన సూత్రాలు.

మన నిత్య జీవితంలో ఈ సూత్రాన్ని ఎలా అన్వయించుకోవచ్చు? ఉదయం లేవగానే అద్దంలో మిమ్మల్ని మీరు చూసుకుని ఒక చిరునవ్వు నవ్వండి. కార్యాలయంలో సహోద్యోగులతో, ఇంట్లో కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు నవ్వుతూ మాట్లాడండి. చిన్నపిల్లల నిష్కల్మష నవ్వును గమనించి, దాన్ని మీరూ అలవర్చుకోండి. ఎంత బిజీగా ఉన్నా, ఎంత ఒత్తిడిలో ఉన్నా, రోజులో కొన్ని క్షణాలైనా నిజాయితీగా నవ్వడానికి కేటాయించండి. ఇది మీ శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు, మీ చుట్టూ ఉన్నవారి జీవితాల్లోనూ వెలుగు నింపుతుంది. గుర్తుంచుకోండి –నవ్వు ఖర్చు లేని ఔషధం, కానీ దాని ప్రభావం అమూల్యం.

---

# ఏపీలో కారిడార్ల పరుగులు!




ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నమూనాలో ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు కనిపిస్తోంది. రాష్ట్రం మొత్తాన్నీ ఒకేలా అభివృద్ధి చేయాలనుకోకుండా, ప్రతి ప్రాంతానికి దాని సహజ బలాలకు అనుగుణంగా ప్రత్యేక ఆర్థిక కారిడార్లుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత ఇప్పుడు ఆచరణలోకి వస్తోంది. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ గ్రీన్ హైడ్రోజన్, పెట్రోకెమికల్స్, ఇనుము–ఉక్కు, ఐటీ, షిప్ బిల్డింగ్ రంగాలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటుండగా, అమరావతి ఎకనామిక్ కారిడార్ ఫైనాన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్‌టెక్, పరిశోధన–అభివృద్ధి రంగాలకు నెలవుగా మారుతోంది. తిరుపతి ఎకనామిక్ కారిడార్ అంతరిక్ష రంగం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ, పర్యాటకంవంటి రంగాలకు కేంద్రంగా ఎదుగుతోంది. ఈ మూడు కారిడార్లతోపాటు, క్వాంటమ్ వ్యాలీ, స్పేస్ సిటీ, ఏరోస్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, ఎలక్ట్రానిక్స్ సిటీ, ఫార్మా సిటీవంటి థీమాటిక్ క్లస్టర్లు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. ఇది కేవలం ప్రణాళికా పత్రాల్లో మాత్రమే మిగిలిపోతున్న ఆలోచన కాదు. ఇప్పటికే గూగుల్ విశాఖపట్నంలో 600 ఎకరాల్లో అమెరికా వెలుపల తన అతిపెద్ద ఏఐ హబ్ ఏర్పాటుకు 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.25 లక్షల కోట్లు) పెట్టుబడి పెడుతోంది, 2028 మధ్యలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అదే నగరంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1.08 లక్షల కోట్లతో గిగా–స్కేల్ ఏఐ డేటా సెంటర్‌ను, రూ.65,000 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాన్ని చేపడుతోంది. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్–నిప్పాన్ స్టీల్ కలిసి రూ.70,000 కోట్లతో 8.2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం గల ఉక్కు యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, ఇది లక్ష మందికిపైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించనుంది. ఈ కారిడార్ ఇప్పుడు కేవలం ఒక భావనగా కాకుండా, పెట్టుబడులను ఆకర్షించే ఒక నిర్దుష్ట ఆర్థిక చోదకశక్తిగా రూపాంతరం చెందుతోంది.

కారిడార్ల వ్యూహం.. ప్రతి ప్రాంతపు ప్రత్యేకతను గుర్తించి తగినట్టుగా పరిశ్రమలను ఆకర్షించడం. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ రూ.2,500 కోట్లతో 267 ఎకరాల్లో తయారీ యూనిట్ నెలకొల్పుతుండగా, 2028 డిసెంబర్ నాటికి కార్యకలాపాలు ప్రారంభమై 3,000 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రూ.7,000 కోట్లతో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పుతూ, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంటోంది. 2026 డిసెంబర్ నాటికే ఏసీల ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఇలాంటి ప్రాజెక్టుల కూర్పు యాదృచ్ఛికం కాదు. –ఇది కారిడార్ ఆధారిత ప్రణాళిక ఫలితమే. తాజా ప్రాజెక్టు ఆమోదాల గణాంకాలను పరిశీలిస్తే, పరిశ్రమలు–వాణిజ్యం రంగంలో 86 ప్రతిపాదనలతో రూ.4.55 లక్షల కోట్ల పెట్టుబడి, 3.32 లక్షల ఉద్యోగాలు; ఇంధన రంగంలో 82 ప్రతిపాదనలతో రూ.3.88 లక్షల కోట్ల పెట్టుబడి, 4.62 లక్షల ఉద్యోగాలు; ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో 52 ప్రతిపాదనలతో రూ.2.85 లక్షల కోట్ల పెట్టుబడి కనిపిస్తోంది. ఈ సంఖ్యలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పును సూచిస్తున్నాయి. సంప్రదాయ పరిశ్రమల నుంచి భవిష్యత్ సాంకేతికతల వైపు మళ్లుతున్న దృక్పథాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నాయి.

ఈ కారిడార్ వ్యూహానికి పునాదిగా నిలుస్తున్నది మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చూపుతున్న చొరవ. తీరప్రాంతంలో ఐదు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. రామాయపట్నం (రూ.4,929 కోట్లు, 34.04 ఎంఎంటీపీఏ సామర్థ్యం), మచిలీపట్నం (రూ.5,156 కోట్లు, 35.12 ఎంఎంటీపీఏ), మూలపేట (రూ.4,362 కోట్లు), కేజీపీఎల్ (రూ.2,620 కోట్లు), ఏఎంఎన్ఎస్ క్యాప్టివ్ పోర్టు (రూ.5,816 కోట్లు, 20.5 ఎంఎంటీపీఏ). వైమానిక రంగంలో 14 అదనపు విమానాశ్రయాలను అందుబాటులోకి తేవాలని, ప్రతి 150 కిలోమీటర్లకు ఒక విమానాశ్రయం ఉండాలని, 10 వాటర్ డ్రోమ్‌లను ప్రారంభించాలని, 2030 నాటికి ఏరోస్పేస్ తయారీలో బిలియన్ డాలర్ల పెట్టుబడిని ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతి రాజధాని నగర నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం, సుర్బానా జురాంగ్ సంస్థ సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో, నాబార్డ్ నుంచి రూ.40,887 కోట్లు ఇప్పటికే సమకూరగా, మరో రూ.43,000 కోట్లు సమీకరించాల్సి ఉంది. రూ.28,000 కోట్ల పెట్టుబడులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీకి అమరావతి నెలవు కానుండటం విశేషం. అంతేకాక, రాష్ట్రం రూ.1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్‌ను వేగవంతం చేసేందుకు కొత్త పీపీపీ పాలసీ–2026ను ఆవిష్కరించి, రూ.1,500 కోట్లను వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌గా కేటాయించడం, ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తోందో స్పష్టం చేస్తోంది.

ఈ మొత్తం వ్యూహం వెనుక ఉన్న అంతిమ లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది –2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 42,000 డాలర్ల తలసరి ఆదాయంతో, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులతో 'స్వర్ణాంధ్ర'గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నది నాయుడు ప్రభుత్వ దార్శనికత. ఇంతటి బృహత్తర లక్ష్యాన్ని సాధించాలంటే, కేవలం భారీ పెట్టుబడులు రావడం మాత్రమే సరిపోదు –అవి సరైన భౌగోళిక ప్రణాళికతో, స్థానిక వనరులకు అనుగుణంగా, పరస్పర అనుసంధానతతో వ్యూహాత్మకంగా వ్యాపించాలి. కారిడార్ల విధానం సరిగ్గా ఈ అవసరాన్నే తీరుస్తోంది. విశాఖపట్నం భారీ పరిశ్రమలు, ఇంధనానికి, అమరావతి భవిష్యత్ సాంకేతికతలు, పాలనకు, తిరుపతి అంతరిక్షం, రక్షణ రంగాలకు కేంద్రంగా మారడం ద్వారా, ఒక్కో ప్రాంతం తన బలాన్ని పెంచుకుంటూనే, రాష్ట్రం మొత్తానికి సమతుల్య అభివృద్ధిని అందించే అవకాశం ఏర్పడుతోంది. గూగుల్, రిలయన్స్, ఆర్సెలర్ మిట్టల్ వంటి అంతర్జాతీయ, జాతీయ దిగ్గజాలు ఇప్పటికే ఈ దార్శనికతపై విశ్వాసం ఉంచి భారీ పెట్టుబడులు పెడుతుండటం, ఏపీ కారిడార్ వ్యూహం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, వాస్తవ రూపం దాల్చుతోందనేందుకు స్పష్టమైన నిదర్శనం. ఈ నిర్మాణాత్మక అభివృద్ధి నమూనా కొనసాగితే, రానున్న దశాబ్దాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశం మెండుగా కనిపిస్తోంది. ■

---




ఎప్పుడూ ప్రతికూలంగా ఆలోచించాలి. రోజంతా ఇంట్లోనే గడపాలి. సరిగ్గా నిద్రపోకపోకూడదు. ప్రతిదానికి ఫిర్యాదు చేయాలి. సమస్యలకు ఇతరులను నిందించాలి. ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్ తినాలి. ఉదయాన్నే ఫోన్ చూస్తూ గడిపేయాలి. భయాలు–నెగెటివిటీని వ్యాప్తి చేసేవారినే అనుసరించాలి. ఇవన్నీ చెప్తే -కోపమొస్తుంది కదూ! ఇవన్నీ జీవితాన్ని నాశనం చేస్తాయని మీకూ తెలుసు కదూ. మరి మంచి జీవితం కావాలనుకుంటే.. -సింపుల్, వీటికి పూర్తి విరుద్ధమైన అలవాట్లు చేసుకోండి. లేదూ శారీరక వ్యాయామంపై దృష్టిపెట్టండి. అన్నీ.. వాటంతట అవే వస్తాయి.

-మహాదేవ

---

## వింతల్లో వింతలు

# ఎలుకతో ఎబ్బెట్టు ఫ్యాషన్



ఆస్ట్రేలియాకు చెందిన 'రాట్ ఆడిటీ గిజార్డ్' అనే వింత వస్తువుల బొటిక్, నిజమైన టాక్సిడెర్మీ (సంరక్షిత) ఎలుకలను కుట్టిన మహిళల లోదుస్తుల శ్రేణితో నెట్టింట తీవ్ర దుమారం రేపింది. గత అక్టోబర్‌లో బ్రాండ్ డిజైనర్‌కు వచ్చిన ఈ 'అద్భుతమైన' (కొందరి దృష్టిలో 'జుగుప్సాకరమైన') ఆలోచన, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వెంటనే వైరల్‌గా మారింది. 'లింజ్‌రాట్' పేరుతో రూపొందించిన ఈ దుస్తులు ధరించడానికి ఉద్దేశించినవి కాదని డిజైనర్ స్పష్టం చేసినా, తమ భాగస్వాములను ఆశ్చర్యపరచడానికో లేదా భయపెట్టడానికో వీటిని ధరించాలని కొందరు ఉత్సాహం చూపడం విశేషం. ఒక్కో జత ధర ఏకంగా 190 ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ.11,400). ఎలుకల మూలం గురించి పారదర్శకంగా వివరణ ఇచ్చినప్పటికీ, ఈ ఉత్పత్తులు తీవ్ర విమర్శలను, వివాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా షిప్పింగ్ సదుపాయం కూడా అందిస్తున్న ఈ బ్రాండ్, షాక్ వాల్యూతో అందరి దృష్టిని ఆకర్షించడంలో మాత్రం విజయం సాధించింది!

# గాలేలో భారత్ పట్టు.. గిల్ సూపర్ క్యాచ్!

- 99 పరుగులకే శ్రీలంక ఐదు వికెట్లు డౌన్
- తొలి ఓవర్‌లోనే సిరాజ్ దెబ్బ
- వరుస వికెట్లతో చెలరేగిన మానవ్ సుతార్
- కమిందు మెండిస్‌ను వెనక్కి పంపిన కుల్దీప్
- గాల్లోకి దూకి అద్భుత క్యాచ్ అందుకున్న గిల్



**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు చేసిన భారత జట్టు.. అనంతరం బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. మూడో రోజు భోజన విరామ సమయానికి శ్రీలంకను 99 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయేలా చేసింది. దీంతో ఆతిథ్య జట్టు ఇంకా 363 పరుగులు వెనుకబడి ఉంది. శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభంలోనే మహ్మద్ సిరాజ్ దెబ్బకొట్టాడు. తన తొలి ఓవర్‌లోనే నిషాన్ ఫెర్నాండోను పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత మానవ్ సుతార్ వరుసగా రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. దినేశ్ చండీమాల్, లహిరు ఉదారాలను ఔట్ చేసి శ్రీలంకను ఒత్తిడిలోకి నెట్టాడు. కుల్దీప్ యాదవ్ కూడా కీలక సమయంలో వికెట్ సాధించాడు.

### గాల్లోకి దూకిన గిల్..

కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో కమిందు మెండిస్ ఇచ్చిన క్యాచ్‌ను శుభ్‌మన్ గిల్ అద్భుతంగా అందుకున్నాడు. బంతి తనకు ఎడమవైపు వెళ్తుండగా మెరుపువేగంతో స్పందించిన గిల్ గాల్లోకి డైవ్ చేసి ఒంటి చేత్తో క్యాచ్‌ను ఒడిసిపట్టాడు. ఈ క్యాచ్ మ్యాచ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు తొమ్మిది వికెట్లకు 460 పరుగులతో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ మరో రెండు పరుగులు జోడించి 116.4 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌటైంది. భారత తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 109 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. వర్షం కారణంగా ఆదివారం రెండు సెషన్ల ఆట నిలిచిపోయినప్పటికీ మూడో రోజు భారత బౌలర్లు ఆరంభం నుంచే శ్రీలంకపై విరుచుకుపడ్డారు. ఐదు వికెట్లు త్వరగా పడిపోవడంతో తొలి టెస్టుపై భారత్ పట్టు మరింత బిగిసింది.



# అమ్మాయిల పోరు డ్రా

**అమ్‌స్టెల్‌వీన్ (నెదర్లాండ్స్):** హాకీ ప్రపంచకప్‌లో టైటిల్ వేటను భారత మహిళల జట్టు డ్రాతో ఆరంభించింది. పూల్-డీలో భాగంగా ఆదివారం ఇక్కడ ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో భారత్.. చైనాతో పోరును 2-2తో డ్రాగా ముగించింది. మూడో క్వార్టర్ దాకా మ్యాచ్‌లో ఆధిక్యం సాధించి గెలుపు దిశగా సాగిన మన అమ్మాయిలు.. ఆ తర్వాత ప్రత్యర్థికి గోల్ సమర్పించుకుని డ్రాతో సంతృప్తిపడాల్సి వచ్చింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (8వ నిమిషంలో), దీపికా (26వ) గోల్స్ చేయగా చైనా నుంచి ఝూంగ్ యింగ్ (14వ), మా నింగ్ (39వ) గోల్స్ సాధించారు. తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఈనెల 18న దక్షిణాఫ్రికాతో తలపడనుంది. కాగా పురుషుల విభాగంలో భారత్.. తమ రెండో మ్యాచ్‌లో సోమవారం ఇంగ్లండ్‌తో ఆడనుంది.




## గంగూలీ ఏప్రిల్ ఫూల్ అయిన వేళ..

దిల్లీ: సహచరులు సరదాగా చేసిన ఓ ప్రాంక్‌కు అప్పటి టీమ్‌ఇండియా కెప్టెన్ సౌరభ్ గంగూలీ కలవరపడ్డాడు. కెప్టెన్సీకి రాజీనామా చేయడానికి కూడా సిద్ధపడ్డాడు. 2005 ఏప్రిల్ ఫూల్స్ డే రోజును జరిగిన ఈ తమాషా ఘటన గురించి హర్భజన్ సింగ్ తాజాగా వివరించాడు. అది ఆటగాళ్లందరికీ నవ్వు తెప్పించినా.. గంగూలీని మాత్రం చాలా టెన్షన్ పెట్టింది. హర్భజన్ చెప్పిన దాని ప్రకారం.. డ్రెస్సింగ్‌రూమ్‌లో నవ్వులు పండించడం కోసం యువరాజ్, హర్భజన్ సింగ్ గంగూలీని ఏప్రిల్ ఫూల్‌ను చేయాలని నిర్ణయించుకున్నారు. నకిలీ వార్తాపత్రిక క్లిపింగ్‌లను తీసుకుని అతడి వద్దకు వెళ్లారు. తన సహచరులు బాధ్యతారహితంగా ఉంటారని, విపరీతంగా పార్టీలు చేసుకుంటారని అందులో ఉంది.
"దాదా ఇదేంటి. మీడియాతో ఇలా చెబుతావా. నన్ను పార్టీ యానిమల్ అన్నావా" అని గంగూలీని యువీ ప్రశ్నించాడు. జహీర్ ఖాన్ విపరీతంగా పార్టీలు చేసుకుంటాడని, హర్భజన్ ఎవరినీ లెక్క చేయడని, నెహ్రా తన లోకంలో తాను ఉంటాడని కూడా అన్నట్లు క్లిపింగ్‌ల్లో ఉందని యువరాజ్ చెప్పాడు. అప్పుడు అక్కడ జట్టంతా ఉంది. ఆ క్లిపింగ్స్‌ను చూసి గంగూలీ నివ్వెరపోయాడు. "నేనెందుకు ఇలా అంటా" అని అని అన్నాడు. సచిన్, ద్రవిడ్ కూడా మిగతా ఆటగాళ్లతో చేరి నాటకంలో భాగమయ్యారు."దాదా నిజంగా నువ్వు ఇలా మాట్లాడి ఉంటే.. అది తప్పు" అని సచిన్ అన్నాడు. ద్రవిడ్ కూడా ఇది సరి కాదు అన్నాడు. సీనియర్ ఆటగాళ్లు కూడా అలా అనడంతో ఆ క్లిపింగ్‌లు పూర్తిగా నిజమేనని నమ్మేశాడు గంగూలీ. "ఒట్టు.. నేనిలా మాట్లాడలేదు. ఒకవేళ నేనిలా మాట్లాడితే (నిరూపిస్తే) కెప్టెన్సీ నుంచి వైదొలుగుతా" అని అన్నాడు. అయినా ఆటగాళ్లు డ్రామాను అంతటితో ఆపలేదు. హర్భజన్, ఇంకొందరు ఆటగాళ్లు తమ కిట్లను తీసుకుని డ్రెసింగ్‌రూమ్ బయటికి నడవడం మొదలు పెట్టారు. దీంతో గంగూలీ తీవ్ర ఆందోళన గురయ్యాడు. పరుగెత్తుకుంటూ వెళ్లి "ఆగండి, రేపే మ్యాచ్. మీరేం చేస్తున్నారు" అని అన్నాడు.

## శ్రీను వైట్ల మళ్లీ మెషిన్ కామెడీ పట్టుకున్నాడా?

శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న ప్రాజెక్ట్ మీద ఫిల్మ్ సర్కిల్స్ లో రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమా పాయింట్ కి సంబంధించి బయటకు వచ్చిన కొన్ని రిపోర్ట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇందులో టైమ్ మిషన్ కు సంబంధించిన ఒక ఎలిమెంట్ ఉండబోతోందనే టాక్ గట్టిగా ప్రచారంలోకి వచ్చింది. అయితే మేకర్స్ నుంచి దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రమోషనల్ అప్డేట్ రాలేదు కాబట్టి, ఇది ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ కథా లేక కథలో ఒక భాగమా అనేది ఇంకా సస్పెన్స్ గానే ఉంది.హీరో శర్వానంద్ ట్రాక్ రికార్డ్ గమనిస్తే ఆయన గతంలోనే 'ఒకే ఒక జీవితం' సినిమాతో టైమ్ ట్రావెల్ జానర్ ను టచ్ చేశారు. ఆ ప్రాజెక్ట్ లో మదర్ సెంటిమెంట్ తో పాటు ఎమోషనల్ జోన్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లోనూ టైమ్ మిషన్ అనే పాయింట్ బయటకు రావడంతో, శర్వా మరోసారి అదే జానర్ లోకి అడుగు పెడుతున్నాడా అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో మొదలైంది. అయితే గతంలో ఎమోషన్ కు స్కోప్ ఉంటే, ఈసారి దర్శకుడి మార్కు ఎంటర్‌టైన్మెంట్ ఉంటుందేమో అనే ఆలోచన కూడా వస్తోంది. మరోవైపు శ్రీను వైట్ల పాస్ట్ ఫిలిమ్స్ ను ఒకసారి పరిశీలిస్తే ఆయన శైలికి తగ్గట్టుగా విభిన్నమైన కామెడీ ట్రాక్స్ ను డిజైన్ చేయడంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్టీఆర్ నటించిన 'బాద్ షా' సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్ ను అమాయకుడిని చేసి "డ్రీమ్ మెషిన్" అనే ఒక ఫేక్ కాన్సెప్ట్ ను క్రియేట్ చేసి థియేటర్లలో పెద్ద ఎత్తున నవ్వులు పూయించారు. ఆ సీన్స్ అప్పట్లో సినిమాకి మెయిన్ హైలైట్స్ లో ఒకటిగా నిలిచాయి.ఇప్పుడు శర్వా తో కూడా నిజంగానే ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తో కూడిన టైమ్ మిషన్ కథ ఉంటుందా, లేదంటే బాద్ షా తరహాలోనే ఏదైనా ఫిక్షనల్ సెటప్ లేదా కామెడీ డివైజ్ క్రియేట్ చేసి దాని చుట్టూ ఫన్ నడిపిస్తారా అనే సందేహాలు వస్తున్నాయి. శ్రీను వైట్ల మార్కు ప్రెసెంట్ చేసే పద్ధతి తెలిసిన వాళ్లు మాత్రం, ఈ పాయింట్ ను సీరియస్ కథగా కాకుండా తన స్టైల్ లోనే ఎంటర్‌టైన్మెంట్ కు వాడుకునే ఛాన్స్ ఉందేమో అనుకుంటారు.ఒకవేళ నిజంగానే కామెడీ డివైజ్ చుట్టూ కాకుండా ప్రాపర్ టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నడిచినా, శ్రీను వైట్ల శైలిలో సిట్యువేషనల్ హ్యూమర్ కు మంచి స్కోప్ దొరికే అవకాశం ఉంటుంది. శర్వానంద్ టైమింగ్ కి, శ్రీను వైట్ల కామెడీ ఐడియాలకు తోడు ఈ కొత్త బ్యాక్ డ్రాప్ కూడా తోడైతే అవుట్ పుట్ డిఫరెంట్ గా వచ్చే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్ట్ లో నిజంగానే ఏదైనా టైమ్ ట్రావెల్ ఎలిమెంట్ ఉందా లేక శ్రీను వైట్ల తన పాత ఫార్ములాలోనే ఏదైనా ఫేక్ కన్ఫ్యూజన్ డ్రామా సెట్ చేశారా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# జాన్వీ - రష్మిక కాంబోలో ట్విస్ట్.. 'రాకా'లో సీక్రెట్ ఏంటి?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతోన్న పవర్ ఫుల్ పాన్ వరల్డ్ సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ 'రాకా'. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రతీ చిన్న వార్త నెట్టింట క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నల పాత్రలకు సంబంధించిన ఆసక్తికర వివరాలు లీకై సోషల్ మీడియాలో విపరీతమైన క్యూరియాసిటీని పెంచేస్తున్నాయి. ఆ లేటెస్ట్ విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**గిరిజన రాణిగా జాన్వీ కపూర్:**
ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో జాన్వీ కపూర్ ఒక పవర్‌ఫుల్ గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించబోతుందట. ఇది కేవలం అతిథి పాత్ర కాకుండా, కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన రోల్ అని టాక్. ఇక ఇప్పటివరకు గ్లామరస్ పాత్రల్లోనే మెరిసిన జాన్వీ, ఈ సినిమాలో చాలా విభిన్న పాత్రతో అలరించనుందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**రక్షకురాలిగా రష్మిక మందన్న:**
మరోవైపు రష్మిక మందన్న కూడా ఈ సినిమాలో ఓ ప్రత్యేకమైన రోల్ చేయబోతోందని సమాచారం. కథానాయకుడికి ఒక గైడ్‌గా, రక్షకురాలిగా వ్యవహరించే పాత్రలో రష్మిక కనిపించనుందట. సెంట్రల్ స్టోరీలైన్‌తో ఈమె పాత్రకు బలమైన కనెక్షన్ ఉండబోతోందని లీక్డ్ వార్తలు చెబుతున్నాయి. ఇక ఇప్పటివరకు చూడని డిఫరెంట్ లుక్స్‌లో ఈ ఇద్దరు భామలు అదరగొట్టబోతున్నారని టాక్.

**మ్యూజిక్ అండ్ షూటింగ్ అప్‌డేట్:**
ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ అల్లు అర్జున్, దీపికా పదుకొణె కాంబినేషన్ సీన్లను చిత్రీకరిస్తున్నారు. ఇక ఈ భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంగ్ సంగీతం అందిస్తున్నారు. బిగ్గెస్ట్ కాస్టింగ్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా మారింది.

**సైన్స్ ఫిక్షన్ విత్ మైథాలజీ ట్విస్ట్:**
'రాకా' అంటే నిండు పౌర్ణమి అనే అర్థం ఉంది. చీకటి నుంచి వెలుగును నింపే యోధుడిగా అల్లు అర్జున్ కనిపించబోతున్నారని, సైన్స్ ఫిక్షన్ కథకి అట్లీ మైథలాజికల్ టచ్ ఇస్తున్నారని నెట్టింట రకరకాల థియరీలు వైరల్ అవుతున్నాయి.
ఇక రోజుకో కొత్త వార్త బయటకు వస్తుండటంతో ఈ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందోనని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.
జాన్వీ కపూర్, రష్మిక మందన్నల రోల్స్‌పై వస్తున్న కథనాలపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే అట్లీ విజన్, బన్నీ ఊరమాస్ క్రేజ్ తోడు కావడంతో 'రాకా' సినిమా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.




PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com